"అభిమానులందరికీ వుంటారు. కాని కర్నూల్లోని నా అభిమాని లాంటి అభిమాని అరుదు ఆ అమ్మాయి మొదటి ఉత్తరం రాసేప్పుడు సిరా బదులు తన రక్తాన్ని వుపయోగించింది తెలుసా? తెలుగులో నా కథలు మాత్రమే చదువుతుందిట.

అక్కడే వున్న మరో రచయిత తెల్ల మొహంవేసూ అడిగాడు.

"అంతే శివతేజ హైద్రాబాద్ వచ్చినప్పుడల్లా నిన్ను కలుస్తూంటుందా?"

# వీళ్ళెప్పుడూ ఇంతే!

రాజేంద్ర మా ఆఫీసులో యు. డి. సి.గా పనిచేస్తున్నాడు. దాదాపు మూడు వేలమంది పని చేసే రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో రాజేంద్ర అందరికీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పరిచయస్తుడే

కారణం రాజేంద్ర రచయిత. అతని కథలు చాలా పత్రికల్లో వచ్చాయి. నాటకాలు రాసాడు. నాటకాల్లో నటిసాడు.

రాజేంద్ర పనిచేసే సెక్షన్లోనే నేను కూడా పనిచేస్తున్నాను. రాజేంద్ర ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా వుంటున్నాను కాబట్టి మా ఇద్దరిమధ్య సాహిత్యం అధికం. ఇద్దరం బ్రహ్మచారులం కాబట్టి ప్రతి శనివారం సెకండ్ షోకి వెళ్ళి అర్ధరాత్రి దాటాక ఇంటికి చేరుకుంటాం. రాజేంద్ర తల్లి వంట అతని రచనల కన్నా ఎంతో బావుంటుందన్న సంగతి రాజేంద్ర కూడా ఒప్పుకుంటాడు.

రాజేంద్ర రాసిన రేడియో నాటిక ఒకటి ప్రసారానికి అంగీకరింపబడింది. దాన్లో రాజేంద్ర కూడా ఓ పాత్ర వేస్తున్నాడు. ఆలిండియా వారి ఆడిషన్ టెస్టులో పాస్ అయ్యాడు. వారి కేజువల్ ఆర్టిస్టుల జాబితాలో రాజేంద్ర పేరుకూడా వుంది.

మర్నాడు నాటకం ప్రసారం అవుతుందనగా ముందురోజు రాజేంద్ర అనుకోకుండా ధార్వార్ వెళ్ళాల్సిన పని పడింది. వారి ఆస్తికి సంబంధించిన కేసులో రాజేంద్ర తల్లి సాక్ష్యం చెప్పాల్సిన అవసరం ఏర్పడటంతో వారి అడ్వకేట్ వాయిదాకి రావలసిందిగా ఉత్తరం రాశారు. అలాంటి తప్పనిసరి పరిస్థితుల్లో రాజేంద్ర ధార్వార్ వెళుతూ, మర్నాడు రాత్రి ఎనిమిదింపావుకి ప్రసారం అయే తన నాటిక వినవలసిందిగా కోరాడు.

రాజేంద్రలో వో బలహీనత వుంది. తన రచనలు ప్రచురించిన పత్రికలకి వాటి మీద నా అభిప్రాయాన్ని రాసి పంపవలసిందిగా అడుగుతుంటాడు. పైగా తనే ఇన్‌లాండ్ కవర్సు కొని తెచ్చి ఇస్తాడు.

మర్నాడు రాత్రి రాజేంద్ర నాటిక "వీళ్ళెప్పుడూ ఇంతే" వినలేకపోయాను. రాజేంద్ర తల్లి లేకపోవడం వల్ల ఫ్రెండ్‌తో మందు కొట్టడంలో మునిగిపోవటంతో ఆ సంగతే గుర్తు రాలేదు.

ఆ మర్నాడు మధ్యాహ్నం "వీళ్ళెప్పుడూ ఇంతే" గురించి గుర్తొచ్చింది. రాత్రి ఇంటికి వెళ్ళాక రాజేంద్ర రచనల ఫైల్ తీసి ఆ నాటిక ప్రతిని చదివాను. వెంటనే వో ఇన్‌లాండ్ కవరులో ఆ నాటికను పొగుడుతూ రాసి, వీలుంటే దాన్ని పునఃప్రసారం చేయమని సూచించాను కూడా. రాజేంద్ర తిరిగి వచ్చాక అడిగాడు తన నాటిక గురించి ఆ నాటిక నాకెలా, ఎందుకు, ఎక్కడ నచ్చిందో వివరించి అలిండియా రేడియో స్టేషన్ డైరెక్టర్‌కి నే రాసిన ఉత్తరం గురించి చెప్పాను.

రెండు రోజుల తర్వాత రాజేంద్ర విసురుగా వచ్చి కోపంగా అడిగాడు

"నిజంగా 'వీళ్ళెప్పుడూ ఇంతే' విన్నావా?"

"అవును!"

"అదసలు ప్రసారమే కాలేదు. ఆ సమయంలో రాష్ట్రపతి ప్రసంగం ప్రసారం అవటం వల్ల నా నాటికను రద్దు చేశారు."

తెల్ల మొహం వేశాను.

వో రోజు రాత్రి నేను, రాజేంద్ర భోజనంచేస్తున్నాం. రేడియోలో శ్రోతలు రాసిన ఉత్తరాలు ప్రసారం చేస్తున్నారు. అన్న తింటున్న ఇద్దరం ఉలిక్కిపడ్డాం ఆ లేఖ వినగానే.

ప్రసారంకాని రాజేంద్ర నాటిక 'పీశ్నెప్పుడూ ఇంతే'ని నేను పొగుడుతూ రాసిన ఉత్తరం అది.

"ప్రభుత్వకార్యాలయాలలో పనిచేసే కొంటరు అసమర్థులకి ఈ నాటిక నిజంగా గొడ్డలి పెట్టు...."నే రాసిన వాక్యాన్ని అనౌన్సర్ చదివాడు.

# ముగ్గురులో ఒక్కడు

ఒక సినిమా పత్రికలో జర్నలిస్టుగా పనిచేసే మిత్రుడితో "అగ్నిసాక్షి" విడుదలయిన రోజు ఫస్ట్ షోకి వెళ్ళి చూశాను. వివిధ సినిమా పత్రికల జర్నలిస్టులంతా వచ్చారు రివ్యూ రాయడానికి వారందరికి ఉచితంగా మొదటిరోజు సినిమా చూపించడం ఆనవాయితీ.

ఇంటర్వెల్‌లో నా మిత్రుడితో చెప్పాను.

"ఇది ఫలానా పత్రికలో సీరియల్‌గా వచ్చిన 'తలంబ్రాలు' నవల కాపీలా వుంది."

వాళ్ళిచ్చిన కూల్‌డ్రింక్ తాగి సినిమా పూరిగా చూశాను.

"డామిడ్ తలంబ్రాలు నవలని పూరిగా కాపీ కొట్టారు నిర్మాతలు కనీసం శ్రీరాములు పేరుని కూడా ఎక్‌నాలెడ్జ్ చెయ్యలేదు. ఇడియట్స్! మీ సినిమా పక్షులంతా ఇంతే"

"రివ్యూలో ఆ సంగతి రాస్తాను! నీ దగ్గర 'తలంబ్రాలు' నవల ఉంటే ఇవ్వు" చెప్పాడు నా జర్నలిస్టు మిత్రుడు కొద్దిగా సానుభూతితో

* * *